క్లుప్తంగా

గ్రామదేవతకు పొంగళ్లు

లింగసముద్రం: మండలంలోని పెంట్రాల పంచాయతీలోని రాళ్లపాడులో ఆదివారం గ్రామదేవత పోలేరమ్మకు ఘనంగా పొంగళ్లు నిర్వహించారు. భక్తులు పొంగళ్ల సామాగ్రితో తప్పెట్లు, తాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ గ్రామం నుంచి ఊరేగింపుగా గ్రామదేవత పోలేరమ్మ గుడివద్దకు చేరుకుని ఆలయ ఆవరణలో పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వర్షాలు సకాలంలో కురిసి పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పొన్నలూరు: మండలంలోని కంభాలదిన్నె సచివాలయ పరిధిలోని రజాసాహెబ్‌పేట, పాతరేణిమడుగు, కొత్తరేణిమడుగు గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వి.శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, వలంటీర్లు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

200 మందికి కంటి వైద్య పరీక్షలు

టంగుటూరు: మండలంలోని మర్లపాడు గ్రామంలో సర్వ నేత్ర ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో డాక్టర్ మానస పాల్గొని 200 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. 18 మందిని శుక్లాల ఆపరేషన్‌కు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు, ఉప్పలపాటి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపాడులో వర్షం

హనుమంతునిపాడు: మండల పరిధిలో పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం వర్షం కురిసింది. హనుమంతునిపాడు, హాజీపురం, కొత్తూరు. దొడ్డిచింతల, కిష్టంపల్లి, కొండారెడ్డిపల్లి, మోరవారిపల్లి, దాసరిపల్లి, మల్లవరం తదితర గ్రామాల్లో ఒక మోస్తారు వర్షం పడింది. ఈ వర్షం నిమ్మతోటలకు, సామాజిక వనాలకు మేలు ఎంతో మేలు చేస్తుందన్నారు. పొలం దుక్కులు దున్నేందుకు కూడా గట్టి వర్షం పడిన గ్రామాల్లో వ్యవసాయ భూములు పదునవుతాయని రైతులు చెప్తున్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న సర్పంచ్ భాస్కర్

జరుగుమల్లి(టంగుటూరు): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బెల్లం నిర్మల అధ్యక్షతన ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పైడిపాడులో విద్యుత్ సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదని, విద్యుత్ శాఖ ఏఈకి చెబుదామంటే గైర్హాజరయ్యారని సర్పంచి నాగినేని భాస్కర్ అసహనం వ్యక్తం చేశారు. పచ్చవ-కామేపల్లి మధ్య రహదారికి మరమ్మతులు చేయించాలని సమావేశం దృష్టికి తెచ్చారు. సర్వసభ్య సమావేశానికి ముఖ్య అధికారులు హాజరు కాకపోవటంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ జలజాక్షి పాల్గొన్నారు.

కోడిపందేల నిర్వాహకుల అరెస్టు

జరుగుమల్లి(టంగుటూరు): కోడి పందేలు నిర్వహిస్తున్న ఆరుగురు వ్యక్తులను సెబ్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. సెబ్ ఎస్సై దయాకర్ తెలిపిన వివరాల మేరకు.. జరుగుమల్లి మండలం నందనవనం గ్రామ శివారులో కోడి పందెం ఆడుతున్న ఆరుగురు నిందితులతోపాటు నాలుగు కోళ్లను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను జరుగుమల్లి పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. దాడిలో సెబ్ సిబ్బంది మీరావళి, ప్రసాదరావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి షాపింగ్ కాంప్లెక్స్‌లు


ఎన్‌టీఆర్ సర్కిల్‌లో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్


పాత కూరగాయల మార్కెట్ స్థలంలో నిర్మించిన కాంప్లెక్స్

- పట్టణంలోని ప్రభుత్వ స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళికలు
- ఇప్పటికే ఏరియా హాస్పటల్ ఎదురు, పాత కూరగాయల మార్కెట్ స్థలాల నిర్మాణాలు పూర్తి
- రెండు కాంప్లెక్స్‌లో 24 వ్యాపార దుకాణాలు అందుబాటులోకి
- రైతుబజార్ పక్కన లారీస్టాండ్ స్థలంలో రూ.70లక్షలతో మరో షాపింగ్ కాంప్లెక్స్, మిగిలిన ఖాళీ స్థలాల్లోను నిర్మాణాలకు ప్రతిపాదనలు
- పన్నేతర ఆదాయం కింద ఏడాదికి మున్సిపాలిటీకి రూ 60లక్షల వరకు ఆదాయం

కందుకూరు: పట్టణంలో షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం అనేది దశాబ్ద కాలంగా ఉన్న సమస్య. పట్టణంలోని ఖాళీ స్థలాలను గుర్తించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేయాలని దశాబ్దం క్రితం కౌన్సిల్ తీర్మానమైంది. అప్పట్లో పలు చోట్ల ప్రతిచోట్ల చేసిన ప్రతిపాదనలు నేటికి కాని ఆచరణలోకి రాలేదు. అయితే ప్రస్తుతం పట్టణంలో షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం ఊపందుకుంది. ఇప్పటికే పట్టణంలోని విలువైన ఖాళీ స్థలాల్లో ఇప్పటికే రెండు కాంప్లెక్స్‌ల నిర్మాణం పూర్తికాగా, మరో నాలుగు ప్రదేశాల్లో నిర్మాణాలకు ప్రతిపాదనలు చేశారు. షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణంతో పేదలకు వ్యాపార దుకాణాలు అందుబాటులోకి రాగా, మున్సిపాలిటీకి పన్నేతర ఆదాయం పెరగనుంది. అదే సందర్భంలో విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా ఉంటున్నాయి.

విలువైన ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు

పట్టణంలో ఎన్‌టీఆర్ సర్కిల్, పామూరు రోడ్డులోని త్యాగరాజు గుడి సమీపంలో, 60అడుగుల రోడ్డు, లారీస్టాండ్ ఇలా తదితర ప్రాంతాల్లో మున్సిపాలిటీకి విలువైన ప్రభుత్వ స్థలాలున్నాయి. వీటిలో షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేయాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. అయితే ఇన్నాళ్లకి ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి చొరవతో ఆ ప్రతిపాదనలు ఆచరణలోకి వచ్చాయి. వీటిలో అత్యంత విలువైన ఎన్‌టీఆర్ సర్కిల్, ప్రభుత్వ ఏరియా వైద్య ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో ఇప్పటికే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని పూర్తి చేసి ఇటీవలే ప్రారంభించారు. ఈ కాంప్లెక్స్‌లో మొత్తం 16 దుకాణాలు అద్దె ప్రాతిపదికన వ్యాపారులకు కేటాయించారు. అన్ని ప్రక్రియలు పూర్తి చేసి ఆగస్టు 1వ తేదీ నుంచి వీటిని వ్యాపారులకు అప్పగించనున్నారు. అలాగే పాత కూరగాయల మార్కెట్ స్థలంలో మరో 8 దుకాణాలతో కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేసి వేలం పాటలో వ్యాపారులకు కేటాయించారు. ఇవికాక కొత్తగా రైతు బజార్ పక్కన ఉన్న లారీస్టాండ్ స్థలంలో రూ.70లక్షల ఖర్చు చేసి 18 దుకాణాలతో భారీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి టెండర్లు పిలవాల్సి ఉంది. ఇక త్యాగరాజు గుడి పక్కన, 60అడుగుల రోడ్డు స్థలాల్లోను, రెండు పార్కుల్లో రెండు దుకాణాలు నిర్మిస్తున్నారు. ఇవి పూర్తయితే 24 వ్యాపార దుకాణాలు అందుబాటులోకి రానున్నాయి. కోట్లు విలువ చేసే విలువైన ప్రభుత్వ స్థలాల్లో ఆక్రణదారులు ఆక్రమించుకుని వ్యాపారులు చేస్తూ వస్తున్నారు. ఈ స్థలాలన్నింటినీ మున్సిపాలిటీ స్వాధీనం చేసుకొని ప్రస్తుతం షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తున్నారు. దీని వల్ల విలువైన ప్రభుత్వ స్థలాలు అన్నీ సంరక్షించడంతో పాటు, మున్సిపాలిటీకి అదనపు ఆదాయం సమకూరనుంది.

పెరగనున్న పన్నేతర ఆదాయం

స్థానిక సంస్థలు సాధారణంగా స్వపరిపాలనా వ్యవస్థలు. వీటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే గ్రాంట్స్‌తో పాటు, పన్ను ఆదాయం, పన్నేతర ఆదాయం ప్రధాన ఆదాయ వనరులు. వీటిలో పన్నేతర ఆదాయం అనేది మున్సిపాలిటీకి ఆస్తుల ద్వారా ద్వారా సమకూరుతుంది. అయితే కందుకూరు లాంటి మున్సిపాలిటీకి వచ్చే పన్నేతర ఆదాయం చాలా స్వల్పం. ప్రస్తుతం షాపింగ్ కాంప్లెక్స్‌ల వంటి నిర్మాణాలతో వచ్చే అద్దెల ద్వారా మున్సిపాలిటీ పన్నేతర ఆదాయం కూడా పెరగనుంది. ఏడాదికి రూ.60లక్షల వరకు వీటి ద్వారా ఆదాయం వస్తుందని మున్సిపల్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇది మున్సిపాలిటీకి శాశ్వత ఆదాయ వనరుగా ఉంటుంది. ఈ క్రమంలో పట్టణంలో విలువైన ప్రభుత్వ స్థలాలన్నిటిని గుర్తించి మున్సిపాలిటీ భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

> **షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం పూర్తి చేస్తాం**
>
> కందుకూరు మున్సిపాలిటీలో ప్రభుత్వ స్థలాల్లో చేపడుతున్న షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలను వీలైనంత త్వరగా పూర్తి చేస్తా. వీటి నిర్మాణంతో మున్సిపాలిటీకి శాశ్వత ఆదాయ వనరులు సమకూరుతాయి. అలాగే ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా ఉంటాయి. ఎమ్మెల్యే సూచనలతో మిగిలిన స్థలాల్లో కూడా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తాం.
>
> – మనోహర్, మున్సిపల్ కమిషనర్

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం

- సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సమన్వయంతో పనిచేయాలి
- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్


గ్రామసచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుర్రా, పక్కన నాయకులు

పామూరు: సచివాలయ వ్యవస్థ ద్వారా జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారమైందని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. మండలంలోని కంబాలదిన్నెలో రూ..40 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఆదివారం ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిదులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మాట్లాడుతూ సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేడు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే అందుతున్నాయన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించి వారి మన్ననలను పొంది ప్రభుత్వానికి పేరుప్రతిష్టలు తేవాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు జన్మభూమి కమిటీ సభ్యులకు, టీడీపీ నాయకులకే అందేవని, ప్రజాసమస్యలపై వచ్చిన అర్జీలు బుట్టదాఖలయ్యేవని ఎద్దేవా చేశారు. ఇప్పటికే 98 శాతానికి పైగా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గంగసాని లక్ష్మి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, కంబాలదిన్నె సర్పంచ్ నీలం వెంకటరమణమ్మ, నీలం శ్రీరాములు, ఎంపీటీసీ నీలం రమణమ్మ, వెంకటరమణయ్య, కొల్లా రమణయ్య, పిచ్చాల తిరుపతిరెడ్డి, మాలకొండారెడ్డి, నక్కా మాల్యాద్రి, గ్రామ కన్వీనర్ నరసింహం, నీలం వెంకటేశ్వర్లు, గద్దే మల్లేశ్వరరావు, యర్రగొర్ల నరసింహం పలువురు నాయకులు పాల్గొన్నారు.

కాకుటూరివారిపాలెంలో కాఫీ విత్ గృహసారథి


స్థానిక నాయకులతో మాట్లాడుతున్న అశోక్‌బాబు

టంగుటూరు: మండలంలోని కాకుటూరివారిపాలెంలో వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఆదివారం కాఫీ విత్ గృహసారథి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్టీ కాలనీలో గృహసారథి వెంకటేశ్వర్లు నివాసంలో స్థానిక నేతలు, ప్రజలతో సమావేశమయ్యారు. సంక్షేమ పథకాల అమల తీరును అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్య, పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేస్తున్నారా లేదా అని విద్యార్థులను ఆరాతీశారు. సంక్షేమ పథకాలు వలంటీర్ల ద్వారా సక్రమంగా అందుతున్నాయని కాలనీ వాసులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక నాయకుడు ఏకుల సుబ్బారాయుడు పక్షవాతంతో బాధపడుతూ విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను పరామర్శించారు. కార్యక్రమంలో కొండపి ఏఎంసీ డైరెక్టర్ టంగుటూరి రామకృష్ణ, సచివాలయ కన్వీనరు మేడికొండ రంగయ్య, మాజీ ఎంపీటీసీ అద్దంకి శేషయ్య, శ్రీపతి నాగేష్, మేడికొండ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు


డంపింగ్ యార్డ్ స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: డంపింగ్ యార్డ్ స్థలాన్ని ఎవరైనా ఆక్రమిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. కంభం రోడ్డులోని పట్టణ శివారు ప్రాంతంలోని డంపింగ్ యార్డ్ స్థలాన్ని ఆదివారం చైర్మన్ గఫార్ పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు ఆక్రమించినా, కబ్జా చేసిన వారిపై తీవ్ర చర్యలుంటాయన్నారు. డంపింగ్ యార్డ్ స్థలాన్ని చెత్త వేయడానికి కేటాయించిందన్నారు. ఇక్కడ ఎటువంటి అక్రమణలు, కట్టాలు చేపట్టిన తక్షణం తొలగిస్తామన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు తక్షణం స్పందించిన చైర్మన్ గఫార్ మండల సర్వేయర్లను పిలిపించి హద్దులు గుర్తించారు. ఆక్రమణదారులు చొరబడకుండా ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. మున్సిపల్, సచివాలయ అధికారుల డంపింగ్ యార్డ్ స్థలంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆదేశించారు. మండల సర్వేయర్‌లతో పాటు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అంకాలమ్మ తిరునాళ్ల


అలంకరణలో అంకాలమ్మ మూలవిగ్రహమూర్తి

పామూరు: మండలకేంద్రమైన పామూరు అంకాలమ్మ వీధిలో గ్రామ దేవత అంకాలమ్మ తిరునాళ్ల ఆదివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు పామూరుకు నలుదిక్కుల నున్న గమిడిరాళ్లవద్ద నుంచి యువకులు నీటిని ఉరేగింపుగా అంకాలమ్మ ఆలయానికి తీసుకువచ్చి అర్చకులు వేదమంత్రాల నడుమ అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులు పొంగళ్లు పొంగించి వేడుకగా ఆలయానికి చేరుకుని పొంగళ్లను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పూజల్లో వైఎస్సార్ సీపీ యూత్ మండల అధ్యక్షుడు యాదాల వెంకట సాయికిరణ్, ఇర్రి కోటిరెడ్డి, పసుపులేటి రఘురాం, ఓగూరి ఏడుకొండలు, పేరం రఘునాథరెడ్డి, ఓగూరి నరసింహారావు, పిడుగు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు


గ్రామదేవతలకు అభిషేకంనీరు పోస్తున్న యువకులు

ప్రతి కూలీకి ఉపాధి కల్పించాలి


ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ, పక్కన ఎంపీపీ, జెడ్పీటీసీలు

కనిగిరి రూరల్: ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక ఆదివారం స్థానిక ఎస్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ శీనారెడ్డి మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రతి గ్రామంలో కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో చేపట్టిన పనులను నిబంధనల ప్రకారం జరిగాయా లేదా అనే దానిపై సమగ్ర విచారణ చేసేందుకే సామాజిక తనిఖీ నిర్వహించినట్లు వెల్లడించారు. అక్రమాలకు పాల్పడితే వారి వద్ద నుంచి రికవరీ చేస్తామన్నారు. ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కూలీలందరికీ ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉపాధి హామీ పథకంలో అనేక గ్రామాల్లో ప్రజా సంబంధిత పనులు, అభివృద్ధి పనులు జరగడాన్ని కొనియాడారు. ఎస్‌ఆర్‌ఈజీఎస్‌లో పనిచేస్తున్న అధికారులు గ్రామాలకు అత్యవసరంగా కావాల్సిన, జరగాల్సిన పనులు గుర్తించి తక్షణం పనులు చేపట్టాలన్నారు. ఉపాధిహామీ పథకంలో పారదర్శకతను పాటించాలన్నారు.

రూ.10.59 కోట్ల పనులకు సామాజిక తనిఖీ

మండలంలోని 25 గ్రామ పంచాయతిల్లో వివిధ శాఖల కింద 2022 జనవరి 4వ తేది నుంచి 2023 మార్చి వరకు సుమారు 945 పనులను రూ 10,59,70,210 కోట్లతో చేపట్టారు. ఈ పనులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో సామాజిక తనిఖీ బృందం గుర్తించిన అంశాలను, లోపాలను ప్రజా వేదికలో వెల్లడించారు. ఉపాధిహామీ పథకంలో 898 పనులు, పీఆర్ శాఖలో 33 పనులు, సర్వశిక్షా అభియాన్‌లో 2 పనులు, సోషల్ ఫారెస్ట్‌లో 6 పనులు, ఆర్‌డబ్ల్యూఎస్‌లో 6 పనులు, మొత్తం 945 పనులు రూ 10.59 కోట్లతో జరిగాయి. వీటిపై 25 గ్రామ పంచాయతీలకు సంబంధించి పనుల జరిగిన పరిశీలన నివేదికలను తనిఖీ బృందం అధికారులకు వెల్లడించారు. కొన్ని చోట్ల కొలతల్లో తేడాలను, పనుల నిర్వహణలో లోపాలను, చిన్న చిన్న సమస్యలను తనిఖీ బృందం గుర్తించినట్లు అధికారులకు వెల్లడించారు. గ్రామాల వారీగా జరిగిన పనులు, అక్కడ గుర్తించిన సమస్యలు, లోపాలు తదితర అంశాలను ఎన్‌ఆర్‌ఈజీఎస్ పీడీకి, విజిలెన్స్ అధికారులకు వివరించారు. ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీడీఓ జేవీబీ మల్లికార్జునరావు, జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీ రాణి, అంబుడ్స్ మెన్ వై శ్రీకాంత్ రెడ్డి, ఏపీఓ షారూన్, ఎస్‌ఆర్‌పీ సుమన్, సీసీలు, సామాజిక తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లి కొలుపులు ప్రారంభం


ఉలవపాడులో వెలసిన పోలేరమ్మ


గ్రామంలో ఊరేగింపు

ఉలవపాడు: మండల కేంద్రమైన ఉలవపాడులో ఆదివారం పోలేరమ్మ తల్లి కొలుపులు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జరుగుతున్న కొలుపుల్లో తొలిరోజు ఉదయం 7 గంటలకు చద్దిపెట్టారు. అనంతరం గ్రామంలో మహిళలు ప్రదర్శన నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు పానకపందేరం జరిపారు. తప్పెట్లు, మేళతాళాల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

చదువుతో ఉజ్వల భవిష్యత్

టంగుటూరు: చదువుతో ఉజ్వల బవిష్యత్ పొందవచ్చని గ్రంథాలయ నిర్వాహకుడు జి.వర్ధనరాజు పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ.. చదవడం మాకిష్టం లాంటి కార్యక్రమాలు పిల్లల్లో సజనాత్మకతను పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.


లైబ్రరీలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో ధర్మపాలన

- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్


పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

పామూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పేదలను ఆదుకుని వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ధర్మపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. మండలంలోని కంబాలదిన్నె గ్రామ సచివాలయ పరిధిలోని కంబాలదిన్నెలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రామధుసూదన్‌యాదవ్ స్థానిక ప్రజాప్రతినిదులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి వారికి రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అందిన సంక్షేమ పథకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కంబాలదిన్నె గ్రామానికి చెందిన పలువురు గ్రామంలో వీధిలైట్ల సమస్యను పరిష్కరించాలని కోరగా తక్షణం సమస్యల పరిష్కరించాలని విద్యుత్‌శాఖాదికారులను ఆదేశించారు. అదేవిధంగా చాలామందికి సాగుభూములు లేవని మండలంలో అందుబాటులో ఉన్న సాగుకు యోగ్యమైన భూములను పేదలకు ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరగా అధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. గ్రామంలో అతర్గతసీసీరోడ్లు, సైడుకాల్వల నిర్మాణం ఆధునికీకరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా గడప గడపకు కార్యక్రమం పూర్తయిన తరువాత సచివాలయానికి రు.20 లక్షల నిధులు మంజూరవుతాయని వాటిని ప్రాధాన్యతా క్రమంలో అవసరమైన పనులకు ఉపయోగించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ గంగసాని లక్ష్మి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ పువ్వాడి రాంబాబు, సచివాలయ మండల కన్వీనర్ ఖాదర్‌బాషా, కంబాలదిన్నె సర్పంచ్ నీలం వెంకటరమణమ్మ, నీలం శ్రీరాములు, ఎంపీటీసీ నీలం రమణమ్మ, వెంకటరమణయ్య, కొల్లా రమణయ్య, పిచ్చాల తిరుపతిరెడ్డి, పిచ్చాల మాలకొండారెడ్డి, నక్కామాల్యాద్రి, హజరత్‌రెడ్డి, కొల్లా నారాయణ, పార్టీ గ్రామ కన్వీనర్ నరసింహం, నీలం వెంకటేశ్వర్లు, గద్దే మల్లేశ్వరరావు, యర్రగొర్ల నరసింహం, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి, చప్పిడి అజయ్, జొన్నలగడ్డ గోవిందయ్య, కోటపాటి రవికుమార్‌రెడ్డి, ఎదురూరి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ బాధితులను ఆదుకోవాలి

వెలిగండ్ల: మణిపూర్‌లో లైంగిక దాడికి గురైన బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు రాయళ్ల మాలకొండయ్య మాట్లాడుతూ సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం గిరిజనుల తెగల మధ్య బీజేపీ పెట్టిన చిచ్చుతో దాదాపు 3 నెలలుగా మణిపూర్ నెత్తురోడుతుందన్నారు. మతోన్మాదాని రెచ్చగొట్టకుండా ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ప్రజాసంఘాలు, అంగన్‌వాడీ, వెలుగు, స్కూల్ కీపర్స్, నాయకులు సిగినం తిరపతయ్య, కండె బాలకృష్ణ, రాయల రమాదేవి, జయకుమారి పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి


ప్రమాణస్వీకారం చేస్తున్న విశ్వబ్రాహ్మణ నూతన కమిటీ

పామూరు: విశ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి వారి సంక్షేమానికి కృషి చేస్తానని మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు తండాయి కృష్ణ, చెలికచర్ల రమణయ్య అన్నారు. స్థానిక అంకాళమ్మ వీధి సంఘ కార్యాలయంలో ఆదివారం నూతన కమిటీ ఎన్నిక సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి అధ్యక్షతన నిర్వహించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతోపాటు ఉపాధ్యక్షునిగా సోడా బ్రహ్మాచారి, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పొన్నపల్లి బ్రహ్మానందం, వినుకొండ శ్యామల, పణిదపు సుధాకర్, నూతలపాటి పోతులూరాచారి, నిమ్మకూరు మాల్యాద్రి, అమ్మనబ్రోలు శివరామయ్య పాల్గొన్నారు.